**సి.పి.బ్రౌన్ అకాడమీ**
**నవ్యవీక్లీ ఉగాది కథలపోటీలో**
**విశేష బహుమతి**
**రూ. 2,000 పొందిన కథ**



“డాడీ, నాకు తల దువ్వవా, స్కూల్‌కి టైము అయిపోతూంది” కళ్ళు నులుముకుని భరద్వాజ లేచి పక్కకి చూసాడు. మంచం పక్క అయిదేళ్ళ కొడుకు కార్తీక్ నిలబడి ఉన్నాడు. గడియారం వైపు చూసాడు. దాదాపు ఏడున్నర చూపిస్తూంది. ‘అరె! వాడు స్కూల్‌కి వెళ్ళాల్సిన టైము అయి పోతూంది అప్పుడే’ అనుకున్నాడు.

“అమ్మ తల దువ్వలేదా?” అడిగాడు మెల్లిగా గుసగుసలాడినట్టు.

“లేదు డాడీ, అసలు డ్రెస్‌కూడా వెయ్యలేదు. నేనే వేసుకున్నాను.” భరధ్వాజ వాడి వేపు చూసాడు. వాడు వేసుకున్న నిక్కరుకి జిప్ పెట్టు కోలేదు. చొక్కా బటన్సు అన్నీ తప్పు పెట్టుకున్నాడు. తలంతా రేగి ఉంది. బెల్టు బిగదీసి నిక్కరు కింద జారకుండా కట్టేసాడు. భరద్వాజ నిట్టూర్పు విడిచాడు. తర్వాత మెల్లిగా కార్తీక్ చొక్కా, నిక్కరూ సరి చేసి బెల్టు పెట్టాడు. దువ్వెన వాడి చేతుల్లోంచి అందుకుని తల నీట్‌గా దువ్వాడు.

# సిల్క్ రిబ్బన్లు

## మల్యాల రత్నమాల

“నీ టిఫిను బాక్స్ ఏదిరా?” అడిగాడు.

“నాన్నమ్మ సంచీలో పెట్టింది డాడీ, అవును గాని డాడీ, అందరూ ఎందుకు కోపంగా ఉన్నారు? ఈ రోజు నాన్నమ్మ కూడా నాతో సరిగా మాట్లాడ లేదు”. ఈ లోపుగా ఆటో హారను బయట వినిపించింది.

“బై డాడీ” వాడు బయటకు తుర్రుమన్నాడు. భరద్వాజ చూపు గోడ మీద కేలెండరు మీద పడింది. పదిహేడవ తారీఖు చూపిస్తోందది. ‘ఇంక మూడు రోజులు! కోర్టు విధించిన గడువు ఇంక మూడురోజుల్లో ముగుస్తుంది. ఆ తర్వాత పరిస్థితుల్ని బట్టి కార్తీక్‌ను చూసుకోడానికి ఎవరైనా మనిషిని పెట్టుకోవాలి. మంచం దిగి వంటింటి వేపు నడిచాడు భరద్వాజ. లోపల తల్లి గొంతు గట్టిగా వినిపిస్తూంది.

“పిదపకాలం మనుషులూ, పిదపకాలం బుద్దులూనూ, ఏళ్ళొస్తే సరి కాదు, కాస్త ఇంగితజ్ఞానం ఉండాలి. మా రోజుల్లో ఇలాంటివి ఉండేవా? అసలు ఏది మంచో ఏది చెడో తెలియక పోతే ఎలా చావాలి?”

“ఏమిటమ్మా” అడిగాడు నెమ్మదిగా భరద్వాజ.

“ఏమీలేదు నాయనా మా కర్మ! మా మాటలు మీరేం పట్టించుకోకండి, ఎలా జరగాల్సి ఉంటే, అలా జరుగుతుంది. అంతా మా నుదుటి మీద ఆ భగవంతుడు రాసిన రాత” అక్కడనించి భరద్వాజ వెళ్ళిపోబోతుంటే శాంతమ్మ అంది. “ఫ్లాస్క్‌లో కాఫీ పోసాను. తాగివెళ్ళు” ఈ మాటలు ఎంతగట్టిగా వినబడుతున్నా పక్క గదిలోంచి ఏ శబ్దమూ రాలేదు. అవును బంధం తెంచుకోవాలనుకున్న దానికి మాటలతో పనేంటి ఇంక. ఉసూరుమంటూ బాత్‌రూమ్ వైపు నడిచాడు భరద్వాజ. స్నానం చేసి, తల్లి చేసిన టిఫిను తిని ఆఫీసుకు బయల్దేరాడు భరద్వాజ.

ఎప్పుడు లేచిందో ఏమో, సునంద కూడా లేచి తయారయి ఆఫీసుకు వెళ్ళడానికి రడీగా ఉంది. శాంతమ్మ సునందతో ఎక్కువ మాట్లాడ్డం మానేసింది. తల్లి తనలో తానే గొణుక్కోవడం తప్పించి, తనతో కూడా ఎక్కువగా మాట్లాడ్డం లేదని గ్రహించాడు భరద్వాజ. హాల్లోకి వచ్చి బూట్లు వేసుకుంటున్న భరద్వాజ దగ్గరకి తండ్రి వెంకట్రావు వచ్చాడు.

“అయితే ఏం నిర్ణయించుకున్నారు?” అడిగాడు తండ్రి.

తలవంచుకునే జవాబిచ్చాడు భరద్వాజ. “ఇంక నిర్ణయించుకోవడానికి ఏముంది? రికన్సిలియేషన్ పీరియడ్ కూడా అయిపోయింది. ఇంక మూడు రోజుల్లో ఎవరిదారి వాళ్ళు చూసుకోడమే”

“మరి బాబు?” అడిగాడు వెంకట్రావు.

“కోర్టు ఎవరి ఆధీనంలో పెడితే వాళ్ళే చూడాలి





అందుకే నేను లాయర్ని ఈరోజు కలుసుకుంటున్నాను''.

వెంకట్రావు ఇంకేం మాట్లాడలేదు. భరద్వాజ ఆఫీసుకు వెళ్ళిన పది నిముషాలకి సునంద ఆఫీసుకు వెళ్ళడానికి బయటకు వచ్చింది. వంటింట్లోంచి చేతులు తుడుచుకుంటూ శాంతమ్మ సునంద దగ్గరికి వచ్చింది.

''అమ్మా! ఒక్కమాట వినివెళ్ళు తల్లీ'' సునంద గుమ్మం దగ్గర ఆగింది.

''అయితే విడిపోడానికే నిశ్చయించుకున్నారా?'' అడిగింది శాంతమ్మ. ఆమె గొంతులోని గాద్గద్యం సునందని కుదిపేసింది. అయినా విసురుగా ''మీకు చెప్పానుకదా అత్తయ్యగారూ, నా అహాన్ని చంపుకుని నేను బ్రతకలేనని, మీరు మళ్ళీ మళ్ళీ అడిగి నన్ను బాధ పెట్టకండి.''

''ఆడదానికి అహం కూడదమ్మా. మీ మావగారు కూడా నన్ను చాలా అణిచేసేవారు. నామీద రెండు మూడుసార్లు చెయ్యికూడా చేసుకున్నారు. అయినా నేను నీ అంత తెగించగలిగినా?'' శాంతమ్మ నెమ్మదిగా హితబోధ చేసింది.

''అది మీకాలం నాటిమాట అత్తయ్యగారూ, ఇప్పుడు నేనూ చదువు కున్నాను. నేను సంపాదిస్తున్నాను. ఎవరి కాళ్ళకిందా అణిగి మణిగి ఉండే అవసరం నాకు లేదు.''

''అది కాదమ్మా, నువ్వో బిడ్డతల్లివి, వాడి బాగోగులైనా చూసుకోవాలి కదా''

''లక్షణంగా చూసుకుంటాను. ఇక మీదట వాడు నా ఆధీనంలోనే ఉంటాడు. వాడిని గూర్చి మీరేం దిగులు పడకండి'' విసవిసానడిచి బయటకు వెళ్ళిపోయింది సునంద.

ఆరేళ్ళక్రితం సునందా, భరద్వాజల వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ఆకాశమంతపందిరీ, భూదేవంత అరుగూ కాకపోయినా, పెళ్ళి చాల అట్టహాసంగానే జరిపించాడు సునంద తండ్రి. పెళ్ళిలో జంటని చూసిన వాళ్ళంతా, ఈడూ జోడని పొగిడారు. ఇద్దరూ ఉద్యోగస్తులైనందు వల్ల వారి కాపురంలో దేనికీ కొరత ఉండేదికాదు. అయితే కార్తీక్ పుట్టిన తర్వాత ఇద్దరి మధ్య జగడాలు రాసాగాయి. కొన్నాళ్ళకి, అవి చిలికి చిలికి గాలివాన అవడం మొదలెట్టాయి. నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయికి వెళ్ళారు ఇద్దరూ.

''మొగుడికి ఒక కప్పు కాఫీ ఇవ్వలేని పెళ్ళాం చచ్చినా ఒకటే, బ్రతికినా ఒకటే'' అన్నాడు భరద్వాజ ఒకసారి.

''నువ్వెంత అర్జిస్తున్నావో, దాదాపూ నేనూ అంతే అర్జిస్తున్నాను, కాఫీ నువ్వే పెట్టి ఇవ్వొచ్చుగా'' బదులు చెప్పింది సునంద. ఆ మాటలమీద చాలా రాద్ధాంతం జరిగింది. ఇద్దరిలో అహం తన్నుకొచ్చేది ప్రతిక్షణం బయటకు. చివరికి ఒకరి వంశాన్ని మరో

కరు దూషించుకోవడం మొదలయ్యేసరికి పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. అయితే కొన్నాళ్ళ వరకూ వాళ్ళిద్దరి మధ్యాగొడవలు మూడో కంటికి తెలియకుండా జాగ్రత్త పడ్డారు. అయినా లాభం లేకపోయింది. చివరికి ఒకరోజు సునంద తెగేసి చెప్పేసింది. ''నేను మీతో కాపురం చెయ్యలేను చెయ్యాలని లేదు కూడా. నేనింట్లోంచి వెళ్ళిపోతాను''.

''వెళ్ళిపోతే వెళ్ళిపో. ఉండి ఎవరినుద్ధరిస్తావు'' భరద్వాజ వొంటి కాలు మీద లేచాడు. చంటివాడ్ని తీసుకుని సునంద పుట్టింటికి వెళ్ళిపోయింది. తిక్కంతా కుదిరాక సునంద ఇంటికి తిరిగి రాకేం చేస్తుందని అనుకున్నాడు భరద్వాజ. కాని ఒకరోజు సునంద బదులు అతనికి కాయితం వచ్చింది. అది సునంద పంపిన విడాకుల నోటీసు. అది చూడగానే అతని మనసు మండిపోయింది. మగవాడిలో స్వతహాగా ఉండే అహంకారం బుసలు కొట్టింది. ''దానికేనా పంతం? నాకు ఉండకూడదా? వెంటనే లాయర్ని సంప్రతించి నోటీసుకు బదులిప్పించేడు. ఇంకొక నోటీసు లాయరు ద్వారా తను కూడా పంపాడు.

ఇద్దరూ ఒకరోజు కోర్టులో హాజరయ్యారు. ఈ విషయాలన్నీ తల్లికీ తండ్రికి తెలియకుండా జాగ్రత్త పడ్డారు. భరద్వాజ. జడ్జీ ఇద్దరినీ ప్రశ్నించిన తర్వాత ఆరునెలలు గడువు విధించేడు. ఆరు నెలల తర్వాత రికన్సిలియేషను అవకపోతే విడాకులు మంజూరుచేస్తానని తీర్పు ఇచ్చాడు. అయితే అందులో జడ్జీ ఓ షరతు విధించాడు. ఈ ఆరు నెలలూ ఇద్దరూ కలిసే ఉండాలి. విడివిడిగా ఉండకూడదు. కుర్రాడు ఇద్దరి దగ్గరా పెరగాలి. సునంద మళ్ళీ అత్తగారి ఇంటికి వచ్చింది.

ఈ విషయాలన్నీ వెంకట్రావుకీ, శాంతమ్మకీ తెలియవు. వాళ్ళు కోర్టు కెళ్ళిన విషయం కూడా తెలియదు. అలాంటి ఊహ కల్లోకి కూడా రాలేని వ్యక్తులు వాళ్ళు.

శాంతమ్మకి ఒకరోజు అనుమానం వచ్చింది. ''మీరిద్దరూ ఒక రూములో పడుకోవడం లేదేమిట్రా?'' నిలదీసి అడిగింది శాంతమ్మ.

''దాని ఆరోగ్యం సరిగ్గాలేదమ్మా, అందుకని నేను విడిగా పడు కుంటున్నాను'' అబద్ధమాడేసాడు భరద్వాజ.

''ఆరోగ్యం బాగులేకపోతే డాక్టరుకి చూపించు. మరీ ఏం పట్టనట్టు తిరుగుతావేం'' సతాయించారు ఇద్దరూ భరద్వాజని. అప్పటికి ఏదో చెప్పి తప్పించుకున్నాడు భరద్వాజ. అయితే అబద్ధాలతో ఎన్నాళ్ళు గోడలు కట్టగలుగుతారు? ఒకరోజు విషయం బద్దలయింది. నిశ్చేష్టులయి పోయారు వెంకట్రావూ శాంతమ్మానూ. వలవల ఏడిచింది శాంతమ్మ. కొడుకునీ కోడల్నీ కూచోబెట్టి ఎన్నోసార్లు నయానా, భయనా చెప్పి చూసారు. ఆ విషయం బయటకు పొక్కిన దగ్గర్నించీ ఆ ఇంట్లో శాంతి లేదు. సౌఖ్యం లేదు. జీవచ్ఛవాల్లా బ్రతుకుతున్నారు. భరద్వాజ, సునంద విడిపోయే రోజు వచ్చే సమయానికి ఆ వృద్ధ దంపతుల్లో ఆందోళన ఎక్కువయింది.

కార్తీక్ ఒకరోజు తండ్రి పక్కలో, ఇంకో రోజు తల్లి పక్కలో పడుకునే వాడు. తండ్రి పక్కలో పడుకున్నా, ఏ అర్ధరాత్రో లేచి తల్లి పక్కలోకి వచ్చేసే వాడు. ఇంక మూడు రోజుల్లో ఈ జగన్నాటకానికి తెరపడి పోతుంది. ఆ తర్వాత ఏం చెయ్యాలి? అన్న ప్రశ్న అందరినీ తొలి చేస్తుంది. కార్తీక్‌ని చూసినప్పుడల్లా అందరి గుండెల్లో గుబులు బయలు దేరుతుంది. మూడు రోజుల తర్వాత వాడి గతి ఏమవుతుంది అన్నది ప్రశ్నార్ధకమే.

చివరికి ఆ రోజు రానే వచ్చింది. ఉదయం పది గంటలకి, భరద్వాజ సునంద కోర్టులో హాజరవ్వాలి. ఉదయం ఏడున్నరకి కార్తీక్ తల్లి దగ్గరకు వచ్చాడు.

''అమ్మా, నాకు స్కూల్ టైమయిపోతూంది. నాకు డ్రెస్ వేసి తల దువ్వవా?''

చేతుల్లో డ్రెస్సూ, దువ్వెనా పట్టుకుని అడిగాడు.

''నువ్వీరోజు స్కూల్‌కి వెళ్ళడం లేదు'' అంది సునంద

''ఏం ఎందుకని?'' కోపంగా అడిగాడు కార్తీక్.

''ప్రశ్నలడక్కు, నేను చెప్తున్నాను. ఈ రోజు స్కూల్ మానెయ్యి''

''నేను మానను. ఈరోజు నితిన్ పుట్టినరోజు. చాక్లెట్లు ఇస్తాడు నేను స్కూల్‌కెళ్ళాలి'' మొండికేసాడు కార్తీక్.

''చెప్తున్నది నీకు కదూ, నువ్వీరోజు స్కూల్‌కి వెళ్ళడం లేదు'' సునంద గట్టిగా చెప్పింది.

''నేను వెళ్ళాలి, నితిన్ తప్పకుండా రమ్మన్నాడు. నాకు పెద్ద చాక్లెట్ కూడా ఇస్తానన్నాడు'' రాగం మొదలు పెట్టాడు కార్తీక్.

''నోరుముయ్యి వెధవా! నీకు కూడా తలబిరుసు బాగా ఎక్కువయింది'' వాడి చేతుల్లోని గుడ్డలు వాడి ముఖానకొట్టి సునంద విసురుగా బాత్ రూములోకి వెళ్ళిపోయింది. వాడు అక్కడే చతికిల పడి ఏడవటం మొదలెట్టాడు. శాంతమ్మ కళ్ళ వెంట కూడా జలజలా నీళ్ళు రాలాయి ఏం చెయ్యాలో ఆమెకి పాలుపోలేదు. వెంకట్రావు కుర్చీలో కదలకుండా కూర్చున్నాడు. అతని మనసులో ఆ క్షణంలో ఏ భావనలు మెదులు తున్నాయో, ఆ భగవంతుడికే తెలియాలి. ఈ గొడవంతా వింటూన్న భరద్వాజ లోపల నించి బయటకు వచ్చాడు. ఏడుస్తూన్న కార్తీక్‌ని లేవనెత్తి ''నేను నీకు ఈరోజు ఇంకా పెద్ద చాక్లెట్ కొనిస్తాగా, ఈరోజు మనందరం ఎక్కడికో వెళుతున్నాము ఏడవకు'' అని వాడ్ని సముదాయించేడు. అయినా వాడు ఏడుపు మానలేదు. తండ్రి చేతుల్లోంచి బయటకు రాడానికి ప్రయతిస్తూ ఏడవటం సాగించేడు. ఒక అయిదు నిముషాల్లో భరద్వాజలో కూడా సహనం చచ్చిపోయింది.

''చెప్తూంటే నీకు కాదు?'' అని చెళ్ళున వాడి చెంపమీద ఒకటి వేసాడు. వాడు బిక్కచచ్చిపోయి గుటకమింగలేక అవస్థపడుతూ గోడకి అతుక్కుపోయాడు. కళ్ళవెంటధారలుగా నీళ్ళు రాసాగాయి శాంతమ్మ ఇంక ఉండబట్టలేక పోయింది. దిగ్గున లేచి వాడ్ని చేతుల్లోకి తీసుకుంది ''ఇది నీ దౌర్భాగ్యంరా నాయనా, ఊరుకో'' అంటూ వాడ్ని గుండెలకి హత్తుకుని పెరట్లోకి వెళ్ళిపోయింది. ఉదయం 9.30 అయింది. కారుబయట పెట్టాడు భరద్వాజ. సునందా, తనూ కలిసే కోర్టుకి వెళ్ళాలా అనే సందేహం కలిగింది అతనికి. సునందవస్తే తీసుకెళదాం. ఆమెనే నిర్ణయించుకోని, అని మనసుని సమాధానపరుచుకున్నాడు. కాని సునంద, పనిమనిషిని పంపి ఆటో తెప్పించుకుంది. ఆమె కార్తీక్‌తో ఆటో ఎక్కబోతూండగా ''అమ్మా ఒక్క మాట తల్లీ'' వెంకట్రావు పిలిచాడు. శాంతమ్మ కూడా వచ్చి వెంకట్రావు పక్కన నిలుచుంది. సునంద వెనక్కి తిరిగింది.

''బాబూ భరద్వాజా'' పిలిచాడు వెంకట్రావు. అప్పటికే తయారయి ఉన్న భరద్వాజ బయటకు



వచ్చాడు.

''ఏం నాన్నా? అడిగాడు.

''నేనూ, మీ అమ్మా ఈవేళ 11 గంటల బస్సులో పల్లెకు వెళ్లిపోతున్నాం'' ప్రకటిం చాడు వెంకట్రావు.

రెండు నిముషాలు నిశ్శబ్దం రాజ్యమే లింది అక్కడ. సునంద తలదించుకుని బొటన వేలితో నేలమీద రాస్తూ నిలబడింది.

''నేనూ వస్తాను మీతో'' కార్తీక్ అన్నాడు. ఎవ్వరూ మాట్లాడలేదు. ''నేనూ వస్తాను తాతయ్యా బామ్మా చెప్పు బామ్మా'' శాంతమ్మ చేతిని కుదిపేస్తూ అడి గాడు కార్తీక్. భరద్వాజ నోరు పెకలింది.

''మీరిప్పుడు పల్లెకెందుకు? ఆ పల్లెలో ఏముంది గనక?''

అతని గొంతుకలో గద్గద ప్రస్ఫుటమయ్యింది. ఇది ఊహించని మలుపు అతనికి.

''ఇక్కడ మాత్రం ఇంక ఏముంటుంది కనక?'' శాంతమ్మ నిష్ఠూరంగా అంది. వెంకట్రావు అన్నాడు మళ్ళీ.

''మాకక్కడ శాంతిగా, సౌఖ్యంగా ఉంటుందను కుంటున్నాం బాబూ! ఎవరికయినా ఎక్కడయినా సుఖంగా ఉండాలనేదే కదా ధ్యేయం''

''పల్లెలో ఇల్లు అమ్మేసారుగా, ఇప్పుడెళ్ళి ఎక్క డంటారు?'' అస్త్రం ప్రయోగించాడు భరద్వాజ.

''ఇల్లు లేకపోతే ఏంబాబూ, ఒక రెండు గదుల ఇల్లు అద్దెకు దొరక్కపోదు. నాకొచ్చే పెన్షను మాకు చాలు. మీరు వచ్చేటప్పటికి మేము ఉండమని ఇప్పుడే చెప్తున్నాను'' భరద్వాజ మాట్లాడలేదు మీరి ప్పుడెందుకెళ్ళి పోతున్నారని సునంద అడగలేక పోయింది. అలా అడిగే హక్కు ఆమెకి లేదని తెలుసు. అసలు భరద్వాజ తనకి కానప్పుడు వాళ్ళ నేమయినా అడిగే హక్కు తనకెక్కడిది? ఈ ఊహ కలిగేసరికి ఆమె కళ్ళు చెమర్చాయి. అయినా సంభా ళించుకుని మెల్లిగా ''మీ ఇష్టం మామయ్య గారూ, మీకు ఎలావీలయితే అలా చెయ్యండి'' అంది. తర్వాత కార్తీక్ భుజానికి వాటరు బాటిల్ తగిలిం చింది. వెంకట్రావు లోపలికి వెళ్ళబోతూన్న వాడల్లా వెనక్కితిరిగి సునంద దగ్గరగా వచ్చి ఆమె తల నిమిరాడు. తర్వాత అన్నాడు ''చూడమ్మా, మీ జీవి తాలు ఎలా దిద్దుకోవాలంటే అలా దిద్దుకోడానికి మీకు సంపూర్ణమయిన హక్కు ఉంది. కాదనను కాని ఆ పసివాడి జీవితాన్ని ఛిద్రం చేసే అధికారం మీకు లేదు. వాడు పుట్టిన దగ్గర్నించీ మీ చుట్టూరా ఊహలతో గూడు కట్టుకున్నాడు. ఆ గూడు భగ్న మైతే ఆ పసివాడి మనసు ఏమవుతుందో ఆలోచిం చాలి మీరు.'' సునంద మాట్లాడలేదు.

''ఇంకొక్కమాట! ఇలాంటి ఆహాలూ, పట్టుద లలూ ఉన్న మీరు అసలు పిల్లాడ్ని కనకుండా ఉండా ల్సింది'' అనేసి లోపలికి వెళ్ళిపోయాడు. కొరడాల్లా తగిలాయి ఆ మాటలు సునందకీ, భరద్వాజకీ.

''మనం కారులో వెళ్ళవచ్చుగా, ఆటోలో ఎందుకు వెళుతున్నాం?'' అడిగాడు కార్తీక్.



''మాట్లాడకుండా కూచో'' తల్లి గంభీరమైన ముఖాన్ని చూసి వాడింకేం మాట్లాడలేదు. ఆటో స్టార్ట్ అయిన తర్వాత భరద్వాజ కూడా కారెక్కాడు.

***

గోడమీదున్న గడియారంలో పదికి ఇంక పది నిముషాలు ఉంది. కోర్టులో బెంచీలు సగమే నిండి ఉన్నాయి. లాయర్లు చాలామంది వచ్చేసారు అప్ప టికే. కొందరు వరండాల్లో, కొందరు కోర్టుహాల్లో, మరికొందరు బెంచీల్లో కూచున్న వ్యక్తులకి ఏవేవో ఆఖరి నిముషం సూచనలు చేస్తు న్నారు. ఆరోజు అయిదారు కేసులు విడాకులవే ఉన్నాయి. అందులో నాలుగోకేసు భరద్వాజ, సునందదీ. ఇప్పుడు కార్తీక్‌ని ఎవరికప్ప జెప్పాల న్నదే కోర్టులో నిర్ణయించవలసిన విషయం. వరండాలో ఒక మూల భర ద్వాజకి, లాయరు ఏ ప్రశ్నలకి ఎలా జవాబులు చెప్పాలో నూరి పోస్తు న్నాడు. కేసు సునంద వేసింది కాబట్టి, భరద్వాజకి కొడుకు మీద హక్కు కోర డానికి కొంత ఆస్కారం ఉంది. అయితే దీనిమీద, చిలవలూపలవలూ అన్నీ చేర్చి కేసుని ఇంకా పటిష్టంగా తయారు చెయ్యాలని భరద్వాజ లాయరు తాపత్రయపడుతున్నాడు. అతను చెప్పే దానిలో సగం మాత్రమే అర్ధమౌతూంది భరద్వా జకి. అతనికి విన్న దాంట్లో తోచిన దొకటే, అది తను చాలా అబద్ధాలు ఆడాల్సివస్తుందని, సునంద తన జీవితాన్ని ఎంత నరకం చేసిందో ఎంత మానసిక క్షోభకి గురిచేసిందో చెప్పి, చివరకి విడాకుల వరకూ తనని తీసుకెళ్ళినందుకు ఆమెకి శిక్షపడాలి, అని చెప్పి, అయితే ఆమెని శిక్షించే బదులు, కార్తీక్ బాధ్యత తన కప్పజెప్తే చాలని తను జడ్జీగారికి చెప్పాలి. మధ్యలో లాయరు కూడా తన వాదనని బలపరుస్తాడన్న మాట. లాయరు బోధల్ని విన్న భరద్వాజకెందుకో మనసు చివుక్కుమంది. అసలు సునంద చేసిన తప్పేమిటి? తాను అబద్ధాలతో ఆమె సంస్కారాన్ని ఛిద్రం చెయ్యాలనడం, ఇదెక్కడి న్యాయం? వరండాలో వేరేచోట సునంద పరిస్థితి కూడా అలాగే ఉంది. ఆమె లాయరు ఆమెకి చెప్పిన మాటలు విన్న తర్వాత మానసిక వేదన మొదల యింది ఆమెలో. పంతానికిపోయి ఇంతవరకూ తెచ్చుకుందా అనిపించసాగింది ఆమె మనసులో.

సునంద లాయరుతో మాట్లాడుతూన్నంత సేపూ, కార్తీక్ ఆమె చీరకుచ్చెళ్ళు పట్టుకుని నిలబడే ఉన్నాడు. క్రిమినల్ కేసులు కూడా అక్కడే చూడ్డం వల్ల, అక్కడ తిరిగే పోలీసులూ, వాళ్ళు తీసుకొచ్చే దొంగల ముఖాలూ అవన్నీ చూస్తూంటే వాడికి భయం పట్టుకుంది. చాలా బెంగగా కూడా ఉంది వాడికి. అదీకాక, ఒకటే చోట ఉన్న అమ్మా నాన్నా దగ్గరగా లేరు. వేరే ఎవరితోనో మాట్లాడుతున్నారు అని వాడి పసి హృదయం తల్లడిల్లుతోంది. సునం దకి కూడా లాయరు మాటలమీద పూర్తి ధ్యాస కల గడం లేదు. ఆమె మనసు అత్తగారి, మామగారి గురించి ఆలోచిస్తూంది. పాపం ఈ వృద్ధాప్యంలో వాళ్ళు పల్లెకు పోయి ఎలా ఉంటారు? మనవడికి వాళ్ళతో చాలా చేరిక. వాళ్ళ ఆనందానికి వాడు కేంద్రం. వాళ్ళు నిర్మించుకున్న ప్రపంచాన్ని, వాళ్ళ ఆనందాన్ని తను దూరం చేస్తూంది. పాపం రోజంతా అత్తగారు తమ బాగోగులకోసమే ఆరాట పడేది. అలాంటి అత్తగారి బాగోగులు చూడకుండా తను దేన్ని సాధిస్తూన్నట్టు. ఈ మనస్తాపంతో తనని

## సూర్య- జ్యోతికల మధ్య గొడవ?

కోలీవుడ్‌లో ఆదర్శ దంపతులుగా ముద్ర పడిన సూర్య, జ్యోతికల మధ్య గొడవలు ప్రారంభం అయినట్లు కనిపిస్తోంది. చిన్న గొడవలే చిలికి చిలికి గాలివాన అవుతాయంటారు. ఈ విష యం బాగా తెలిసిన సూర్య గొడవ పెద్దది కాకుండా జాగ్రత్తపడ్డాడట! అసలు విషయాని కొస్తే...

ఓ చిన్న పొగడ్త కారణంగా జ్యోతిక సూర్యతో రెండు రోజుల పాటు మాట్లాడకుండా భీష్మించు కొని కూర్చుంది. మొదటి రోజు సూర్య కూడా బింకంగా ఉన్నప్పటికీ రెండవరోజు ఇక దిగి రాక తప్పలేదు. అసలు ఈ గొడవంతటికీ కారణం ఎవ రంటే... మన టాలీవుడ్ హాట్ హీరోయిన్ అనుష్క! అనుష్క, సూర్య జంటగా 'యముడు' అనే చిత్రంలో నటిస్తున్నారు. మాటల సందర్భంలో సూర్య, జ్యోతిక ముందు అనుష్కని తెగ పొగిడేస రికి జ్యోతికకు అరికాలి మంట నెత్తికెక్కింది. దానితో ఇక జ్యోతిక ముఖం అంతా మాడ్చుకుని సూర్యతో మాట్లాడకుండా మౌన వ్రతం పాటిం చింది. జ్యోతిక మౌన వ్రతాన్ని ముందు జోక్‌గా తీసుకున్నా, చివరికి పరిస్థితి విషమించడంతో దిగి వచ్చి జ్యోతికతో సంధి కుదుర్చుకున్నాడు. కడి వెడు గుమ్మడికాయ కత్తిపీటకు లోకువన్నట్టు, బయట ఎంత పెద్ద హీరో అయినా పెళ్ళాం దగ్గర జీరో అయిపోయాడని కోలీవుడ్‌లో పలువురు గుస గుసలాడుకుంటున్నారు.

తనే సాధించుకుంటూన్నట్టు అనుభూతి కలగసాగింది సునందకి.

పది గంటలకి జడ్జీగారు వచ్చారు. భరద్వాజ ఎడం వేపు బెంచీల్లో కూర్చున్నాడు. సునంద, కార్తీక్‌తో కుడి చేతివేపు బెంచీల్లో ఒక పెద్దావిడ పక్కన కూర్చుంది.

చివరకి వాళ్ళ కేసు విచారణకు వచ్చింది. ఒక అరగంట సేపు బోనులో వాళ్ళిద్దరినే కాకుండా సాక్షులను కూడా విచారించాక సునందతరపు లాయరు జడ్జీగారికి అప్పీలు చేసాడు.

"మిలార్డ్, ఈ భరద్వాజ అనే వ్యక్తి, వృత్తిరీత్యా సాఫ్ట్‌వేరు ఇంజనీరు, నా క్లయింట్ సునంద అనే అమ్మాయిని ఆరేళ్ళ క్రితం వివాహం చేసుకున్నాడు. ఒక ఏడాది తర్వాత, కార్తీక్ అనబడే కొడుకు పుట్టాక తన చదువుని, సంసారాన్ని అన్నీ మరచిపోయి, తన భార్య అయిన నా క్లయింటు సునందని, మానసికంగా, శారీరకంగా హింసించడం మొదలు పెట్టాడు. ఆమె కూడా సాఫ్ట్‌వేరు ఇంజనీరు అవటం వల్ల ఆమె ఆర్జించిన సొమ్ముని కూడా తనకిమ్మని వేధించేవాడు. ఇవ్వకపోతే చెయ్యి చేసుకునేవాడు. వ్యసనాలకి బానిస అయి ఇంటికి సరిగా రాకుండా, పరాయి స్త్రీలతో అక్రమ సంబంధాలు పెట్టుకుని నా క్లయింట్ సునందని విపరీతమ్మైన మానసిక క్షోభకి గురిచేసాడు. ఈ విషయం ఇందాక వాళ్ళింట్లో పని చేసిన పనిమనిషి స్టేట్‌మెంట్సు ద్వారా ఋజువయ్యింది."

"అబద్ధం!" అరిచాడు భరద్వాజ, అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"అబద్ధం!" అని సునంద కూడా అరుద్దామనుకుంది. కాని గొంతుక పెగల్లేదు.

"అంతేకాదు మిలార్డ్, నా క్లయింటుని వేధించడంలో ఇతనికి, తల్లిదండ్రులు కూడా సహాయం చేసేవారు"

ఒక భార్యాభర్తల మధ్య సంబంధాన్ని ఎంత వక్రంగా న్యాయవాదులు చిత్రీకరించగలరో, భరద్వాజకీ, సునందకీ ఆ క్షణం అర్థమయింది. లాయరు ఆర్గ్యుమెంటు కంటిన్యూ చేసాడు.

"మిలార్డ్, ఈ బాధలు నాలుగేళ్ళు భరించి, ఇంక భరించలేక, నా క్లయింటు సునంద ఈ కోర్టులో విడాకుల కోసం దరఖాస్తు చేసుకుంది. మిలార్డ్, అంతేకాదు వ్యసనాలకి బానిసయిన తన భర్త దగ్గర తన కొడుకు పెరిగితే, ఆ కుర్రాడి జీవితం పాడవుతుందని ఆ కుర్రాడి కస్టడీ తనకు ఇవ్వాలని అర్జీపెట్టుకుంది. మిలార్డ్, హానరబుల్ కోర్టు వారు, ఆ దరఖాస్తుని, అర్జీని సహృదయంతో పరిశీలించి, విడాకులు మంజూరు చేసి నా క్లయింటుకు న్యాయం చెయ్యమని కోరుతున్నాను."

తర్వాత భరద్వాజ తరపు లాయరు తనవాదన వినిపించేడు. "సునంద తరపు లాయరుగారు, చాలా చాకచక్యంగా, అబద్ధపు సాక్ష్యాలు పెట్టి, నా క్లయింట్ భరద్వాజని, ఒక నీతిలేని వాడిగా, వ్యసనపరుడిగా, చిత్రీకరించడానికి వ్యర్థ ప్రయత్నం చేసారు. అంతేకాదు, వారి క్లయింట్ సునంద మంచితనం ఎస్టాబ్లిష్ చేద్దామని శ్రమపడ్డారు. అయితే నా క్లయింట్ యొక్క మంచితనం ఇందాక ఇంటి డ్రైవరు ఇచ్చిన సాక్ష్యంతో ధృవ పడింది. నా క్లయింట్ భరద్వాజ అమాయకుడు, మంచివాడు, సంఘంలో గొప్ప పేరున్న వ్యక్తి. వారి కుటుంబం గురించి కూడా అందరికీ తెలుసు. ఇతను తన భార్య సునందని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఆమె అంటే ప్రాణంగా చూసుకున్నాడు. కొడుకు పుట్టాక సునంద ప్రవర్తనలో వచ్చిన మార్పువల్ల మానసికంగా క్షోభ పడ్డాడు. 'మిలార్డ్' శ్రీమతి సునంద, అంటే నా క్లయింట్ భార్య పెళ్ళయిన రెండు సంవత్సరాల తర్వాత, అంటే కొడుకు పుట్టిన ఒక సంవత్సరం నిండీ, విచ్చలవిడి అలవాట్లు అలవాటు చేసుకుంది. చెడుస్నేహాలను చేసుకుని తిరుగుళ్ళు మొదలు పెట్టింది. భర్తనీ కొడుకునీ పూర్తిగా నిర్లక్ష్యం చేసి వాళ్ళ జీవితాల్లో అలజడి సృష్టించింది. మందలించిన మామగారు, అత్తగారి మీద కక్ష పెంచుకుంది. క్లబ్బులకీ, పబ్‌లకీ తిరుగుతూండే ఆమె ప్రవర్తనకి విసిగి నా క్లయింట్ భరద్వాజ ఆవేశంలో ఆమెని ఏమైనా ఒకటి రెండు మాటలని ఉండొచ్చు. అది నా క్లయింట్ పడ్డ మానసిక క్షోభకి తార్కాణమే గాని ఆమెని హింస పెట్టాడని సునంద తరపు లాయరు చెప్పింది అబద్ధం."

ఇంకా ఏదో చెప్తున్నాడు భరద్వాజ లాయరు.

అక్కడేం జరుగుతూందో తెలియటం లేదు భరద్వాజకే, సునందకీ అచేతనంగా చేష్టలుడిగి నిలబడిపోయారు అలా.

కేసంతా ముగిసాక జడ్జీగారు తీర్పుచెప్పే సమయం వచ్చింది. అప్పటికి టైము సాయంత్రం నాలుగయింది. భరద్వాజ వెళ్ళి బెంచీల్లో కూచున్నాడు. సునంద మాత్రం ఓ పక్కన నిలుచుంది ఇంకొక రెండు నిమిషాలు. వాళ్ళ భవిష్యత్తుని కలోరంగా మార్చెయ్యగల తీర్పు వెలువడ డానికి ఇంక కేవలం రెండే రెండు నిముషాలు, భరద్వాజ నుదుటి మీద చెమట అద్దుకున్నాడు. అతని మనసంతా కల్లోలంగా ఉంది కడుపులో వికారంగా ఉంది. సునంద పరిస్థితి కూడా అలాగే ఉంది నిలుచున్న సునంద దగ్గరికి కార్తీక్ మెల్లిగా నడిచి వచ్చాడు. సునంద చీర కుచ్చెళ్ళు పట్టుకు లాగాడు సునంద ఒంగి.

"ఏరా! ఏం కావాలి" నెమ్మదిగా అడిగింది.

"ఆకలేస్తూందమ్మా" అన్నాడు కార్తీక్. వాడి కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి. సునంద తల తిరిగిపోయింది. చంటి కుర్రాడికి ఇంటి నించి బయలుదేరిన మొదలు ఏమి పెట్టలేదు తాను. అసలు పొద్దున్నించీ ఈ కేసు విషయాల్నే ఆలోచించింది కాని, వాడికి ఆకలేస్తుందన్న ఆలోచన రాలేదు తనకు. పాపం, పసివెధవ పోలీసులని వాళ్ళనీ చూస్తూ బిక్కచచ్చిపోయి. రోజల్లా నీళ్ళు తాగి గడిపేసి ఉంటాడు. ఈ ఊహ కలిగే సరికి సునందకి దుఃఖం ఆగలేదు. కళ్ళవెంట నీళ్ళు జలజలా రాలి పోతుంటే వాడ్ని గుండెలకి హత్తుకుంది. ఏడవడం మొదలెట్టింది. ఆమెనే గమనిస్తున్న పక్కనున్న పోలీసు కానిస్టేబుల్ హెచ్చరించాడు.

"అమ్మా, జడ్జీగారు తీర్పు చెప్తున్నారు వినండి" అని. జడ్జీగారి కంఠస్వరం వినబడింది.

"ఈ కేసులో పూర్వాపరాలు పరిశీలించిన పిదప...."ఇంకా చెప్పబోతూన్న జడ్జీగారి ముందరకి కార్తీక్‌ని ఎత్తుకునే పరిగెట్టింది సునంద "ఆగండి!" అరిచింది సునంద. ఈ హఠాత్పరిణామానికి కోర్టులో అందరూ నివ్వెరపోయారు.

"నాకు విడాకులు వద్దు, నా భర్తతో నేను కాపురం చేస్తాను. నా అప్లికేషను వెనక్కి తీసుకుంటాను" అనేసి కింద చతికిలపడి ఏడవసాగింది. తల్లి ఏడవడం చూసి, కార్తీక్ కూడా ఏడవటం మొదలెట్టాడు. భరద్వాజ ఒక్క అంగలో బెంచీల మీద నించి దూకి సునంద దగ్గరకి వచ్చాడు. రెండు చేతుల్తో ఆమెని లేపి ఆమె కళ్ళు తుడిచాడు. కార్తీక్‌ని భుజం మీదకు ఎత్తుకున్నాడు. జడ్జీ కళ్ళద్దాలు తీసి టేబిలు మీద పెట్టి కుర్చీలో వెనక్కి వాలాడు. నుదురు పట్టుకున్నాడు. మనసులో ఆలోచనలు మెదిలాయి ఆయనకి. 'భార్యా భర్తలు పుష్పగుచ్ఛాల్లాంటి వాళ్ళు, అందులో కూర్చిన స్వచ్ఛమైన, నిర్మలమైన పువ్వులా ఉండాలి వాళ్ళ జీవితాలు. ఆ అందమైన పుష్పగుచ్ఛాలను విడిపోకుండా కలిపి ఉంచేవే చుట్టూరా కట్టిన రంగు రంగుల సిల్క్ రిబ్బన్లు. అవే పిల్లలు. భగవంతుడా, ఈ అహాలూ, అతిశయాలూ, సృష్టించిన నువ్వే, ఈ సిల్క్ రిబ్బన్ల లాంటి పిల్లల్ని కూడా సృష్టించి ఎంత అందమైన బంధాల్ని ఏర్పరచేవయ్యా' తర్వాత జడ్జీ ముందుకి వంగి కళ్ళద్దాలు పెట్టుకున్నాడు.

"ఈ కేసు కొట్టేస్తున్నాను" ప్రకటించాడు.

ఆ కేసుతో ఏ సంబంధమూ లేని కోర్టులో జనం అంతా చప్పట్లు కొట్టారు.

*

## సహనం బలహీనత కాదు



ఈ కథ వ్రాయడానికి ప్రేరణ నాకు సమాజం నించే లభించింది. ప్రస్తుత కాలంలో యువత, జీవన విధానంలో ఆలోచనలూ, నిర్ణయాలు, క్రియలూ అన్నీ వేగంతోనూ, తొందరపాటు తోనూ కూడుకుని ఉంటున్నాయి. ప్రతిరోజూ కోర్టుల్లో విడిపోతున్న జంటలే దీనికి తార్కాణం. వారి తొందరపాటు వల్ల బంగారం లాంటి వాళ్ళ జీవితాలు నాశనమౌతున్నాయన్న వ్యథే ఈ కథకి కారణం. సహనం బలహీనత కాదు, ఒక సద్గుణం అని భార్యాభర్తలు ఎప్పుడు భావిస్తారో అప్పుడే వాళ్ళ జీవితాలు నందనవనమౌతాయి. వాళ్ళ చుట్టూ ఉన్నవాళ్ళ జీవితాలు ఆనందమయమౌతాయి.

-మల్యాల రత్నమాల

040-27177719